సాక్షి ఒడిశా

శుక్రవారం । 21 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,64,687లు, బంగారం 1.55 గ్రాములు, వెండి 5.5 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఎవరో వస్తారని.. ఎదురు చూడకుండా..!

- శ్రమదానంతో సాగునీటి కాలువ తవ్వుకున్న రైతులు

- 8లో.



మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు

- 8లో.

న్యూస్‌రీల్

నెక్కంటికి అభినందనలు



నెక్కంటికి అభినందిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

రాయగడ: బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షులుగా నియమితులై, రాయగడకు చేరుకున్న రాజ్య సభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావును వివిధ సంఘాలు, సంస్థలకు చెందిన ప్రతినిధులు గురువారం అభినందించారు. పట్టణంలోని రాణిగుడ ఫారంలో ఉన్న ఆయన నివాసానికి చేరుకొని, పుష్పగుచ్ఛాలు అందించారు. పార్టీ కార్యకర్తలతో ఆయన నివాసం సందడిగా మారింది.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ



రోటరీ క్లబ్ వాటర్ ఫిల్టర్

జయపురం: స్థానిక సమితిలోని కుంధారిగుడ ప్రాథమిక పాఠశాలకు జయపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ ఫిల్టర్‌ను గురువారం వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు అశోక్ మిశ్రా, సభ్యులు ఈ మేరకు పాఠశాలకు చేరుకొని, హెచ్ఎం సౌధామణి సాహుకు అందించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు సమకూర్చేందుకు వెచ్చించాలని కోరారు. అలాగే పాఠశాల సమస్యలపై ఉపాధ్యాయులతో చర్చించి, పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిచాలన కమిటీ సభ్యులు రామహరి పండా, ప్రదీప్ సామంతరాయ్, మురళీ సాబత్, సంతోష్ మహపాత్ర, దినేష్ పాత్రో, కనూ పాత్ర, ఎం.రుషీకేష్, ప్రదీప్ సాహు, ప్రభాకర చౌధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సును ఢీకొన్న లారీ



ఘటనా స్థలంలో బస్సు-లారీ

కొరాపుట్: ప్రైవేటు బస్సును బాక్సైట్ లారీ ఢీకొనడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి కేంద్రానికి సమీపంలో ఉన్న ఘాట్ రోడ్డు వద్ద గురువారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గుణుపూర్ నుంచి జయపురం వస్తున్న సంతోషి బస్సును కొడింగామాలి నుంచి బాక్సైట్ లోడుతో వస్తున్న లారీ అధిక బరువుతో అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా, వారిని లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కొరాపుట్‌లోని షాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు.

ప్లాస్టిక్ విక్రయాలపై అపరాధ రుసుం



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించిన నేపథ్యంలో పర్లాకిమిడి మున్సిపల్, ఆరోగ్యశాఖ అధికారులు పట్టణంలోని కొత్త బస్టాండ్, మార్కెట్‌లోని పలు దుకాణాల్లో అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న టోకు వర్తకులపై అపరాధ రుసుం విధించారు. దాడుల్లో డిప్యూటీ కలెక్టర్ తపస్వినీ బెహరా, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ అధికారి బలమాలి శత్పథి, పుర పాలక సిబ్బంది పాల్గొన్నారు. పర్లాకిమిడిలో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని జూలై 3నుంచి రద్దు చేశామని, పట్టణంలోని కాలవల్లో ఈ వ్యర్థాలు నిండిపోవడంతో ప్రజలకు హాని కలిగిస్తున్నాయని ఈఓ తెలిపారు. ప్రజలు దీనిని గమనించి, సహకరించాలని కోరారు.

ప్రగతి పథంలో.. ఒడిశా

- రాష్ట్ర మంత్రులు జగన్నాథ సరక, అతున్ సవ్యసాయి
- రాయగడలో వేదాంత ఆధ్వర్యంలో జాబ్ మేళా
- ఎంపికైన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేత



విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందిస్తున్న మంత్రులు సరక, సవ్యసాచి, సీఈఓ



గుణుపూర్‌లో మంత్రి అతున్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే గమాంగొ, నాయకులు



సమావేశానికి హాజరైన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు

రాయగడ: రాష్ట్రం పారిశ్రామిక ప్రగతి పథంలో పయనిస్తోందని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖమంత్రి, జిల్లా ప్రణాళిక సంఘం చైర్మన్ అతున్ సవ్యసాచి అన్నారు. లంజిఘడ్‌లోని వేదాంత పరిశ్రమ ఆధ్వర్యంలో రాయగడ బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఉతాన్ పేరిట గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు ఇరువురూ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సరక మాట్లాడుతూ... యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో కొత్త పరిశ్రమలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఇండాల్ సమీపంలో ఉన్న లంజిఘడ్ వంటి బృహత్తర పరిశ్రమలతో కొంతవరకు నిరుద్యోగ సమస్య తీరిందని, అయితే పారిశ్రామిక యాజమాన్యం స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలని కోరారు. లంజిఘడ్‌లోని వేదాంత పరిశ్రమలో 30మందికి ఉద్యోగాలు కల్పించడంపై హర్షం వ్యక్తంచేశారు.

ఉజ్వల భవిష్యత్..

పారిశ్రామిక రంగంలో రాష్ట్రం ఎంతో ముందుందని పౌర సంబంధాల మంత్రి అతున్ సవ్యసాచి అన్నారు. రాష్ట్రంలో ఖనిజ వనరులు, ప్రాకృతిక సంపదలకు కొదవలేదని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించగలమని అభిప్రాయం వ్యక్తంచేశారు. అలాగే నిరుద్యోగ సమస్యను నియంత్రించవచ్చన్నారు. ఆ దిశగా ప్రభుత్వం సైతం యోచిస్తోందన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో మరికొన్ని బృహత్తర పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమకు ఉద్యోగాలు వస్తాయనే పట్టుదలతో చదివితే.. భవిష్యత్ ఎంతోఉజ్వలమయంగా మారుతుందని సూచించారు.

పారిశ్రామికీకరణతో..

లంజిఘడ్ లోని బృహత్తర వేదాంత్ పరిశ్రమ రాయగడ, కలహండి జిల్లాల ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తోందని కంపెనీ సీఈఓ జీజీ పాల్ పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న చోట ఫలితం తప్పకుండా లభిస్తుందన్నారు. ఒకప్పుడు ఈ 2జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా చూసేవారని, పారిశ్రామిక ప్రగతి అనంతరం ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధించాయని తెలిపారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకుంటుదని వివరించారు. కొత్తగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు మంత్రులు, సీఈఓ ఎంపిక పత్రాలను వారి తల్లిదండ్రుల సమక్షంలో అందించి, అభినందించారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా అదనపు కలెక్టర్ ధర్మానంద బెహరా, పృథ్వీరాజ్ సాహు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి..

రాయగడ: 'రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి ఆశలు, ఆశయాలను నెరవేర్చే బాధ్యత ప్రభుత్వానిది. ప్రజా సంక్షేమార్థం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాల'ని ష్ట పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమశాఖ మంత్రి, జిల్లా ప్రణాళిక మండలి చైర్మన్ అతున్ సవ్యసాచి ఆదేశించారు. స్థానిక సర్క్యూట్ హౌస్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆదివాసీ హరిజన సంక్షేమ, న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరక, జిల్లా అదనపు కలెక్టర్ ధర్మానంద బెహర, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి, మాజీమంత్రి లాల్‌బిహారి హిమిరిక, సమితి చైర్మన్ టున్ని హుయిక, బీజేడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు జిన్ను హికక, సీనియర్ నాయకుడు జగదీష్ పాత్రొ,జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బిజూ పక్కా ఇళ్ల నిర్మాణంలో అర్హులైన వారందరికీ సకాలంలో మంజూరైన నిధులను చెల్లించాలని సూచించారు. ప్రతి పంచాయతీకి 'అమో ఒడిశా-నవీన్ ఒడిశా' పథకం కింద మంజూరు చేస్తున్న రూ.50 లక్షల నిధుల వినియోగంలో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సంబధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇసుక, చిప్స్ వంటి నిర్మాణ సామగ్రి సరసమైన ధరల్లో అందుబాటులో ఉండేవిధంగా చూడాలని వివరించారు.

గుణుపూర్‌లో..

రాయగడలో సమీక్ష ముగిసిన అనంతరం మంత్రి సవ్యసాచి జిల్లాలోని గుణుపూర్‌లో పర్యటించారు. అక్కడి నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారొ తదితలు పాల్గొన్నారు.

సాధారణ ప్రయాణికులకు ఎకానమీ భోజనం

- రౌర్కెలా, ఝార్సుగుడ రైల్వే స్టేషన్లలో ప్రారంభం



రైల్వే ప్లాట్‌ఫాంపై ఎకానమి భోజన విక్రయ కేంద్రం

భువనేశ్వర్: సాధారణ శ్రేణి రైలు ప్రయాణికుల కోసం రైల్వేశాఖ సరికొత్త సౌకర్యాన్ని ప్రవేశ పెట్టింది. ఈ సౌకర్యాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు. కార్యాచరణ సాధ్యాసాధ్యాలను విశ్లేషించిన మేరకు తదుపరి కార్యాచరణ ఖరారు చేస్తారు. సాధారణ శ్రేణి ప్రయాణికులకు సరసమైన ధరలకు ఎకానమీ భోజనం, స్నాక్స్, కోంబో మీల్స్, నీళ్ల సీసాలు విక్రయిస్తారు. ఈ బోగీలకు చేరువలో సంబంధిత రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై అందుబాటులో వీటి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. జోనల్ రైల్వే అధికారులతో సంప్రదించి ఐఆర్‌సీటీసీ ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఐఆర్‌సీటీసీ కిచెన్ యూనిట్ల(రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు-ఆర్ఆర్, జన ఆహార్ జేఏ) ఎకానమీ భోజనాలు, తినుబండారాలు సరఫరా చేస్తాయి. 6నెలలు ఈ సౌకర్యం ప్రయోగాత్మకంగా కొనసాగిస్తారు. ఈ కేంద్రాలు రాష్ట్రంలోని రౌర్కెలా, ఝార్సుగుడ రైల్వే స్టేషన్లలో ప్రారంభించారు. తొలి విడత కింద దేశవ్యాప్తంగా 64 రైల్వే స్టేషన్లలో ఈ సౌకర్యం కల్పించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. త్వరలో తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్‌తో సహా మరిన్ని స్టేషన్లలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలివిడత కింద దేశవ్యాప్తంగా పలు చోట్ల 51 స్టేషన్లలో ఎకానమి భోజన విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు.


ధరల వివరాలు..

రూ.20లు: 7 పూరీలు(175 గ్రాములు), డ్రై ఆలూ వెజ్(150 గ్రాములు), ఊరగాయ(12 గ్రాములు), స్నాక్ మీల్(350 గ్రాములు).

రూ.50లు: సౌత్ ఇండియన్ రైస్ లేదా రాజ్మా, చోలే-రైస్ లేదా ఖిచ్డీ లేదా కుల్చే, భాతురే-చోలే లేదా పావ్ భాజీ లేదా మసాలా దోస.

వీటితో 200 గ్రాముల నీళ్లగ్లాసు సరఫరా చేస్తారు. ఈ సౌకర్యం అందుబాటులో లేనిచోట లీటర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిల్ అందజేస్తారు.

ఆత్మ విశ్వాసానికి ప్రతీక.. ఎన్‌సీసీ



క్యాడెట్లతో సమావేశమైన ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ముఖర్జీ

జయపురం: ఎన్‌సీసీ చేరడం కేవలం సర్టిఫికెట్ కోసం కాదని.. దీనివల్ల ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పం అలవడతాయని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ పరాగ్ ముఖర్జి త్నారు. పట్టణంలోని విక్రమదేవ్ విశ్వ విద్యాలయాన్ని సందర్శించిన ఆయనకు ఎన్‌సీసీ విద్యార్థులు గార్డ్ ఆఫ్ ఆనర్‌తోస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయాన్ని సందర్శించిన అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. లెఫ్టినెంట్ డాక్టర్ లక్ష్మణ పాత్రొ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీ కార్యక్రమాలపై వివరించారు. కమాండర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు మాతృదేశ సేవకు అంకితం కావాలని సూచించారు. అలాగే హెడ్‌క్వార్టర్‌లో ఏర్పాటు చేసిన ఫైరింగ్ రేంజ్, శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సమకూర్చిన 3 ఎకరాల స్థలాన్ని పరిశబులించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల హల్దార్‌తో సమావేశమై, వివిధ విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ నవీన పరాసర్, ఏఎన్ఓ డాక్టర్ పాత్రొ, సీటీఓ సంతోషిని ముండా, సతీష్ చంద్ర, సూర్జిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాల సమావేశాలకు బీజేడీ ఎంపీలు



నూతన పార్లమెంట్ భవనంలోని పార్టీ కార్యాలయం వద్ద బీజేడీ ఎంపీలు

కొరాపుట్: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు రాష్ట్రానికి చెందిన బీజూ జనతా దళ్ ఎంపీలు హాజరయ్యారు. గురువారం సమావేశాలు ప్రారంభం సందర్భంగా నూతన పార్లమెంట్ భవనంలో పార్టీకి కేటాయించిన 45ఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. తొలిరోజు దివంగత ఎంపీల మృతికి నివాళులర్పించామని నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి పేర్కొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించామన్నారు. సార్వత్రిక ఎన్నికల వాతావరణం దేశవ్యాప్తంగా నెలకొనడంతో రాష్ట్రానికి రావాల్సిన ఆర్థికసాయం కోసం విధి విధానాలతో ముందుకు వెళ్లనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎంపీలు రమేష్‌చంద్ర మాఝి(నవరంగ్‌పూర్), నిరంజన్ పిసీ(రాజ్యసభ), చంద్రశేఖర్ సాహు(బ్రహ్మపుర), మహిమ మహంతా(రాజ్యసభ), డాక్టర్ రాజశ్రీ మాలిక్(జగత్‌సింగ్‌పూర్), మంజులతా మండల్(భద్రక్), మహేష్ సాహు(డెంఖనాల్) పాల్గొన్నారు.

'ఉపాధి పనుల్లో అక్రమాలు'



ఘటబగరలో యంత్రంతో చేస్తున్న ఉపాధి పనులు

జయపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వేతనదారులకు కల్పించాల్సిన పనులను కంట్రాక్టర్లు, యంత్రాలతో చేయిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యులు గౌతమ్ సామంతరాయ్ ఆరోపించారు. జయపురం సమితి కలియాగాం పంచాయతీ నువాగుడ ఘటభగరా గ్రామంలో చేయిస్తున్న పనులే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. పనులు అధికార పార్టీ నాయకులను సంతృప్తి పరిచేందుకు జరుగుతున్నాయని విమర్శించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే సైతం మౌనం వహించడంపై నిలదీశారు. దీనిపై బీడీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

16 గ్రామాలకు రాకపోకలు బంద్



బయ్యాపాద ఘాటీలో పూడుకుపోయిన రోడ్డు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి బయపాడ గ్రామం వద్ద ఉన్న ఘాట్ రోడ్డులో బుధవారం రాత్రి నుంచి భారీ వర్షం కురవడంతో కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో సమితిలోని 16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘాటీపై నుంచే బలిమెల, చిత్రకొండ, ఖొయిర్‌పూట్ సమితులకు చేరుకోవాల్సి ఉంది. అయితే చరియలు విరిగి పడటతో గురువారం ఉదయం సమాచారం అందుకున్న అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. పంగం వద్ద సప్తధార నదిపై వరదనీరు ప్రభావం తగ్గడంతో బస్సులు నడిచేందుకు అధికారులు అనుమతించారు.

అలాగే పొట్టేరు వద్ద కూడా నీరు తగ్గుముఖం పట్టడంతో మల్కన్‌గిరి నుంచి కలిమెల, మోటు, భద్రాలం, హైద్రాబాద్, ఛత్తీస్‌గఢ్ వెళ్లే వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి.

ఆటో చార్జీలు నియంత్రించాలి



సబ్ కలెక్టర్‌తో చర్చిస్తున్న సిటిజన్ కమిటీ సభ్యులు

- పట్టణ సమస్యలపై సిటిజన్ ఫోరం చర్చలు

జయపురం: పట్టణంలో ఆటో చార్జీలు నియత్రించడంతో పాటు జయపురం నుంచి రైల్వేస్టేషన్, జిల్లా కేంద్ర ఆస్పత్రి తదితర ప్రాంతాలకు సిటీ బస్సులు నడపాలని సిటిజన్ ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని, రాత్రి బస్సుల్లో వచ్చే ప్రయాణీకుల నుంచి రూ.200ల వరకు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. దీనికి గుర్తించి, నిర్దిష్ట ఆటో చార్జీలు నిర్ణయించాలని కోరారు. అలాగే ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సమావేశంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బిసి, జయపురం తహసీల్దార్ సాగరిక షాడంగి, ఈఓ సిద్ధార్థ పట్నాయక్, జయపురం సిటిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మో ఘరో' రుణం మంజూరు



లబ్ధిదారునికి చెక్కు అందిస్తున్న అధికారులు

జయపురం: ఇల్లు పేదలందరికీ పక్కా నివాసాలు సమకూర్చేలా రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రకటించిన 'మో ఘరో' పథకంలో భాగంగా జయపురం సమితి కలియ పంచాయతీ బ్రజబంధు మిశ్రా ప్రథమ లబ్ధిదారుడిగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో భారత స్టేట్ బ్యాంక్ ద్వారా రూ.3 లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జయపురం బీడీఓ రాజీవ్‌దాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు కల్పించే లక్ష్యంతో పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇందులో రూ.లక్ష, నుంచి రూ.3 లక్షల వరకు రుణం పొందవచ్చని వెల్లడించారు. అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏబీడీఓ మనోజ్‌కుమార్ నాయక్, సర్పంచ్‌లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

కాశీనగర్‌లో 'నా డైరీ'లు పంపిణీ



పర్తాడలో 'నా డైరీ'లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ బ్లాక్ పరిధి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 'నా డైరీ 2023-24' నోటు పుస్తకాలను జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ విద్యార్థులకు గురువారం అందజేశారు. జిల్లాలో మొత్తం 880 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో విద్యాశాఖ అందిస్తున్న సిలబస్, మిడ్ డే మీల్, పాఠశాల నిబంధనలు పొందుపరిచామన్నారు. అలాగే కాశీనగర్ సమితిలోని రాణిపేట, వంశధార ఉన్నత విద్యాలయం, శ్రీవిష్ణుపూర్ పీయూపీ పాఠశాల, పర్తాడ, ఖండవ గ్రామాల్లో విద్యాలయాలను సందర్శించిన ఆయన.. ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతుల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రదోష్‌కుమార్ నాయక్, విద్యాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రాణిపేటలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

జోరుగా ఎక్సైజ్ దాడులు



కళ్లికోట్‌లో స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

బరంపురం: గంజాం జిల్లాలోని వివిధ బ్లాక్‌ల పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసులు వరుస దాడులు చేపట్టారు. ఇందులో 8మంది నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా అందించిన సమాచారం ప్రకారం జిల్లా పోలీసు పరిధిలోని పులసరా, బంజనగర్, కళ్లికోట్, అస్కా, పురుసోత్తపురం బ్లాక్‌లలో సార తయారు చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు జిల్లా పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు.. 2500 లీటర్ల బెల్లం ఊట, 288 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

23న జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరంలోని ఫైర్‌చెస్ స్కూల్‌లో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఓపెన్ కేటగిరీలో నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 9703344488 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏడుతులాల బంగారు ఆభరణాల చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక పద్మావతి నగర్‌లో నివాసం ఉంటున్న రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్న హైందవి ఇంట్లో దొంగలు బుధవారం రాత్రి చొరబడ్డారు. ఆమె ఇంటి తలుపులు, తాళాలు పగుల గొట్టి, లోపలికి వెళ్లి కప్‌బోర్డు బీరువాలో ఉన్న ఏడుతులాల బంగారు ఆభరణాలను చోరీచేసి ఇల్లంతా చిందరవందర చేశారు. విషయం తెలుసుకున్న విజయనగరం డీఎస్పీ గోవిందరావు, రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తిరుపతిరావు తెలిపారు.

పట్టుబడిన గొలుసు దొంగ

బొబ్బిలి: పట్టణంలోని రాజ్‌మహల్ కాలనీకి చెందిన సరోజిని మంగళవారం ఫ్లైఓవర్ కింద నుంచి గుడికి వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకు పోయిన నిందితుడిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ పుల్లారు శ్రీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యూపీలోని లక్నోకు చెందిన సతీష్ కుమార్ వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలోనే దొంగిలించిన నగతో ఉడాయించేందుకు బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతుండగా పోలీసులు పట్టుకున్నారని చెప్పారు. బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

పీఎం యశస్వి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ప్రధానమంత్రి ఎంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ 2023-24 ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారిత అధికారి ఎస్.కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ 2023 పీఎం యశస్వి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. పీఎం యశస్వి ప్రవేశ పరీక్ష సెప్టెంబర్ 29న జరుగుతుందని పేర్కొన్నారు. ఆగస్టు 10తేదీలోగా హెచ్‌టీటీపీ//వైఈఎస్.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో చేర్పులు, మార్పుల కోసం ఆగస్టు 12 నుంచి 16 వరకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదుకు మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతా, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు

సివిల్స్, గ్రూప్-1, 2 పరీక్షలకు శిక్షణ ఇచ్చేందేకు ఏపీ స్టడీ సర్కిల్ నిర్ణయించిందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి ఎండీ గయాజుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్‌కు విశాఖపట్నంలో, గ్రూప్-1కు విజయవాడలో గ్రూపు-2కు తిరుపతిలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ ఇతర కులాలకు చెందిన వారు, రూ.6లక్షలలోపు వార్షిక ఆదాయం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు హెచ్‌టీటీపీ://ఏపీఎస్‌టీడీసీ.ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గంజాయి నిందితుడి అరెస్టు

శృంగవరపుకోట: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్.కోట సీఐ బాలసూర్యారావు గురువారం తెలిపారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలకేంద్రానికి చెందిన లింగేటి బొంజునాయుడు ఏప్రిల్ నెలలో 124కిలోల గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు.

ఎవరో వస్తారని.. ఎదురు చూడకుండా..!

- 11ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్న చెక్ డ్యాం
- శ్రమదానంతో సాగునీటి కాలువను తవ్వుకున్న రైతులు

రాయగడ:

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రైతులంతా శ్రమదానంతో సాగునీటి కాలువను నిర్మించుకున్నారు. తమ పంట పొలాలకు సాగునీరు అందేలా కృషి చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని కాసీపూర్ సమితి గొడిబలి పంచాయతీ నువా గ్రామానికి చెందిన పంట పొలాలకు సాగునీరందే విధంగా 2012లో రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.45 లక్షల నిధులు కేటాయించగా, మైనర్ ఇరిగేషన్ డివిజన్ అధికారులు చెక్‌డ్యాం నిర్మించారు. పనులు పూర్తయ్యి దాదాపు 11 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు కాలువలు నిర్మించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు నీరందేలా చర్యలు చేపట్టాలని మంత్రులు, ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. డ్యాంలో నీరు ఉన్నా తగిన కాలువలు లేక పోవడంతో పంటలు పండించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నష్టాలు తప్పవని కుంగిపోయారు.



శ్రమదానంతో కాలువ తవ్వుతున్న రైతులు

ప్రతి ఇంటి నుంచి..

ఈ నేపథ్యంలో తమ పంట పొలాలకు తామే నీరు సమకూర్చుకోవాలని తీర్మానించుకొని, గ్రామంలో సమావేశమయ్యారు. ప్రతి ఇంటి నుంచీ ఇద్దరు చొప్పున్న రోజూ కాలువ తవ్వే పనుల్లో పాల్గోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో రైతులు కొండలను తొలిచి, శ్రమదానంతో కాలువలు తవ్వే పనిలో నిమగ్నమయ్యారు. చెక్‌డ్యాం నుంచి సుమారు 500 మీటర్ల పొడవైన కాలువను తవ్వారు. దీని ఫలితంగా సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో నీరందుతుందని గ్రామస్తులు దమో గౌడొ, మాధవ గౌడొ, రామ గౌడొ తెలిపారు. ఎన్నోసార్లు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇకపై ఎవరిపై ఆధార పడకుండా అంతా ఏకమై శ్రమదానంతో కాలువను నిర్మించేందుకు సంకల్పించామని ప్రకటించారు. ప్రస్తుతం తమ పొలాలకు సాగునీరు అందుతోందని, వరి పంట వేసేందుకు సన్నద్ధం అవుతున్నామని ఆనందం వ్యక్తంచేశారు. ఇదే విషయమై మైనర్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బసంత సారేన్‌ను ప్రశ్నించగా.. తన దృష్టికి సమస్య రాలేదన్నారు. త్వరలో ఆ గ్రామాన్ని పరిశీలించి, రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.



కాలువల నుంచి వస్తున్న సాగునీరు



నిరుపయోగంగా పడి ఉన్న చెక్‌డ్యాం

ప్రతీ సెంటు భూమికి సాగునీరు

- తోటపల్లి ఎడమ కాలువకు 150 క్యూసెక్కుల నీరు విడుదల
- కుడికాలువకు 60 క్యూస్కెల నీరు
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు

వీరఘట్టం/గరుగుబిల్లి:

తోటపల్లి ఆయకట్టు పరిధిలోని ప్రతీ సెంటు భూమికి సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు వద్ద పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువలకు గురువారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు సమకూర్చుతున్నట్టు వెల్లడించారు. రైతులు సాగునీటి వృథాను అరికట్టి పంటల సాగుకు వినియోగించుకోవాలని సూచించారు. శివారు ప్రాంతానికి సాగునీరునందించేందుకు జలవనరులశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తోటపల్లి ప్రాజెక్టు వద్ద 414 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఎడమ కాలువ రెగ్యులేటర్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని, 106 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పాత కుడి కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముందుగా నీటిని నేరుగా పాలకొండ శివారు వరకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అధికారులకు సూచించారు. నీటి విడుదలకు ముందు ఎడమకాలువ రెగ్యులేటర్ వద్ద గంగమ్మ తల్లికి తోటపల్లి వేంకటేశ్వర ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



ఎడమకాలువలో ప్రవహిస్తున్న తోటపల్లి నీరు

ఆధునీకీకరణ పనులపై ఆరా...

తోటపల్లి కాలువల ఆధునీకీకరణ పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని, వచ్చే ఖరీఫ్ నాటికి ఈ పనులు పూర్తిచేయాలని కంబా జోగులు, విక్రాంత్‌లు అధికారులకు సూచించారు. ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునీకీకరణ పనులకు ప్రభుత్వం రూ.193.58 కోట్లు కేటాయించిందన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులపై ఆరా తీశారు. 37.536 కి.మీ. పొడవున ఉన్న ఎడమకాలువలో 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని జలవనరులశాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకరరావు తెలిపారు. 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో 9.676 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టామన్నారు. మొత్తం 55.152 కి.మీ.కు ఇంత వరకు 26.519 కి.మీ అనగా 48 శాతం పనులు చేపట్టామని చెప్పారు. నీటి సరఫరాకు అడ్డంకులు లేకుండా బ్రాంచి కాలువల్లో శివారు వరకు జంగిల్ క్లియరెన్స్ చేశామని తెలిపారు.

64 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తాం...

తోటపల్లి ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 2.50 టీఎంసీలు కాగా ప్రసుత్తం 2 టీఎంసీలు ఉందని డీఈఈ దమలపాటి రవికుమార్ తెలిపారు. ప్రాజెక్టులో గరిష్ట నీటినిల్వ 105 మీటర్లు కాగా ప్రస్తుతం 104.5 మీటర్ల నీరు నిల్వ ఉందన్నారు. కుడి, ఎడమ కాలువల పరిధిలో ఉన్న 64 వేల ఎకరాలకు ఖరీఫ్ చివరి వరకు సాగు నీరు అందిస్తామని తెలిపారు. సాగునీటి వృథాను అరికట్టేందుకు ప్రధాన బ్రాంచిల వద్ద మరమ్మతులకు గురైన షట్టర్లను తొలగించి కొత్త షట్టర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విజయనగరం జెడ్పీ వైఎస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వీరఘట్టం, గరుగుబిల్లి, వంగర ఎంపీపీలు దమలపాటి వెంకటరమణనాయుడు, ఉరిటి రామారావు, ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, పాలకొండ వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాశరావు, కరణం సుదర్శన్, పాలవలస ధవళేశ్వరరావు, ఏఈఓ గౌరీశంకర్, డి.వి.రమణ పాల్గొన్నారు.

నిత్యావసర ధరలపై కాంగ్రెస్ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బరంపురం: రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తారా? లేదా గద్దె దిగుతారా? అని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పితావాసి పండా అని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో దక్షిణాంచల్ ఆర్‌డీసీ కార్యాలయం ఎదుట వివిధ ప్రజా సమస్యలపై గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నిత్యావసర ధరలు సాధారణ మానవునికి అందబాటులో లేకుండా ఆకాశాన్ని తాకుతున్నాయని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై అదనపు బారం మోపడం సరికాదన్నారు. వలస కార్మికులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు. అలాగే లింగరాజ్ న్యాయ విద్యాలయాన్ని విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేసి, ఎల్‌ఎల్‌ఎం పాఠ్యంశాలు ప్రారంభించాలని కోరారు. తమ ప్రతిపాదనలు వెంటనే అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డీసీ ఆఫాంగొ ఆవో కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో పార్టీ జిల్లాస్థాయి నాయకులు, కార్యరక్తలు పాల్గొన్నారు.



ఆర్‌డీసీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉపాధి పనులపై సమీక్ష



ఉపాధిపై సమీక్షలో పాల్గొన్న అధికారులు

జయపురం: బొరిగుమ్మ పంచాయతీ సమితి కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సమితి స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. బీడీఓ ప్రణయ రంజన్ బెహరా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా లోక్‌పాల్ నళినీ టక్రి, జిల్లా సామాజిక సమీక్షకులు అనీల్ మహరాణా మాట్లాడారు. ఉపాధి వేతనదారులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై వివరించారు. బొరిగుమ్మ సమితిలో 30 పంచాయతీల్లో కల్పిస్తున్న పనులపై చర్చించారు. సమావేశంలో సమితిలోని వివిధ పంచాయతీల ఈఓలు పాల్గొని, పథకం అమలుపై వివరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తమకు వేతనం అందలేదని ఏ ఒక్క శ్రామికుడి నుంచి ఫిర్యాదు లేకుండా సకాలంలో బ్యాంకు అకౌంట్లలో వేతనాలు జమ చేయాలని సూచించారు. సమీక్షలో సమితి సామాజికసమీక్షకులు జేమ్స్ మిహిర్ మహానందియ, అదనపు బీడీఓ మాధురి ఆచారి, అసిస్టెంట్ ఇంజినీర్ సత్యనారాయణ శెఠి, సమితి సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విక్రమ్, మేయర్



పాఠశాల ప్రాంగణలో వన మహోత్సవాల్లో విద్యార్థులు

బరంపురం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి స్వచ్ఛమైన వాతావరణంతో ప్రకతిని కాపాడుకుందామని ఎమ్మెల్యే విక్రమ్ పండా కోరారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వన మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని దీపాల్ స్కూల్ ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు మేయర్ సంఘమిత్ర దొళాయి పాల్గొని మొక్కలు నాటారు. అంతా మొక్కలు నాటి, ఇతరులను కూడా చైతన్య పరచాలని సూచించారు. బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మోతి, ఉపాధ్యక్షురాలు వీణ, ఉపాధ్యక్షురాలు పద్మజ, ప్రీతిమంజరి, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

బొబ్బిలి: ఉద్యోగం ఇప్పిస్తామని రూ.10లక్షలకు టోకరా వేసిందే కాక డబ్బులు అడిగిన పాపానికి దాడులకు తెగబడడం అన్యాయమని బీఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి సోరు సాంబయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా చేపట్టారు. స్వామి వారి వీధికి చెందిన ఉపాధ్యాయుడు చింతల సింహాచలం, లక్ష్మిదంపతులు ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలకడంతో అదే వీధికి చెందిన కర్రి ప్రభావతి రూ.10లక్షలు చెల్లించింది. చాలా రోజులుగా ఉద్యోగాలు లేక, డబ్బులూ ఇవ్వకపోవడంతో వెళ్లి నిలదీస్తే ఆ ఉపాధ్యాయుడి దంపతులతో పాటు వారి కుమారులు కూడా తనపై దాడి చేసినట్టు తహసీల్దార్ కార్యాలయంలో బాధితురాలు ప్రభావతి ఫిర్యాదు చేసింది. వెంటనే తన డబ్బు తనకు ఇప్పించాలని కోరింది. స్వామి వారి వీధి వాసులు ధర్నాలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్‌లను నిషేధించాలి

విజయనగరం అర్బన్: ఆన్‌లైన్‌లో వస్తున్న అనేక యాప్‌ల వల్ల యువత భవిష్యత్త అగమ్యగోచరంగా మారిందని వాటిని నిషేధించాలని ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆన్‌లైన్ బెట్టింగ్ మొదలైన యాప్‌లను తక్షణమే ప్రభుత్వ నిషేధించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ యాప్‌లో జరిగే నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, జి.నిఖిల్, లక్ష్మి, సంధ్య, శిరీష, మౌనిక, స్వాతి, సురేష్, సాయి, హర్ష, గోపి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న ఏఐవైఎఫ్ కమిటీ సభ్యులు

యువకుడిపై లైంగికదాడి కేసు నమోదు

- డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన యువకుడు వర్రి శివరాంపై లైంగికదాడి కేసు నమోదు చేశామని చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించి గరివిడి పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వెదుళ్లవలస గ్రామానికి చెందిన శివరాం..అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమిస్తున్న విషయం తెలిసి బాలిక తల్లి, గ్రామపెద్దలు ఆ యువకుడిని మందలించారు. గ్రామపెద్దలు మందలించిన తరువాత ఆ యువకుడు పనినిమిత్తం ఏలూరు వెళ్లిపోయాడు. అనంతరం బాలికకు మాయమాటలు చెప్పి ఏలూరు రప్పించాడు. ఈ విషయమై ఈనెల 11న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎల్.దామోదరరావు ఆధ్వర్యంలో గాలించి బాలికను రాజమండ్రిలో గుర్తించి తీసుకువచ్చారు. ఈ క్రమంలో తనపై పలుమార్లు శివరాం లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తెలియజేయడంతో లైంగికదాడి కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలియజేశారు. నిందితుడు శివరాంను పెనుబర్తి జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో చీపురుపల్లి సీఐ సంజీవరావు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చక్రవర్తి

ఘోషా ఆస్పత్రిలో సేవలు భేష్..!

- హైరిస్క్ గర్భిణులకు ప్రసవాలు
- గైనిక్ సమస్యలకు శస్త్రచికిత్స
- పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి రిఫరల్స్

విజయనగరం ఫోర్ట్: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన ఘోషాఆస్పత్రిలో మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు భేషుగ్గా అందుతున్నాయి. దీంతో అధిక శాతం మంది మహిళలు ఇక్కడ సేవలు పొందడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రసవాల దగ్గర నుంచి మహిళలకు అన్ని రకాల గైనిక్ సమస్యలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. గైనిక్‌కు సంబంధించి స్పెలిస్టులు ఇక్కడ ఉండడంతో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి నిత్యం రిఫరల్స్ వస్తున్నాయి. వీటికి కూడా ఇక్కడ సేవలను వైద్య సిబ్బంది అందిస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో చేరిన రోగులు సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన గర్భిణులు ప్రసవం కోసం ఘోషాఆస్పత్రికి వస్తున్నారు. జిల్లాతో పాటు శ్రీకాకుళంజిల్లా రణస్థలం, జి.సిగడాం, విశాఖపట్నం జిల్లా పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల నుంచి గర్భిణులు వస్తుండగా నెలకు 300 నుంచి 400 వరకు ప్రసవాలు ఘోషా ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు.



ఘోషా ఆస్పత్రి

అందుబాటులోకి స్పెషలిస్టు వైద్యసేవలు

ఘోషా ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. సౌకర్యాలు కూడా మెరుగుపడ్డాయి. గతంలో సివిల్ అసిస్టెంట్స్ సర్జన్, సివిల్ సర్జన్స్ ఉండేవారు. ఇప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు వచ్చారు. అదే విధంగా పోస్టు గ్రాడ్యుయేట్స్ కూడా సేవలు అందిస్తున్నారు. దీంతో అత్యవసర పరిస్థితి ఉన్న గర్భిణులు, గైనిక్ సంబంధిత వ్యాధులకు చికిత్స, శస్త్రచికిత్సలు చేస్తున్నారు. హైబీపీ, బీపీ, సుగర్ ఉన్న వారు, హెచ్ఐఈ, క్షయ, రక్తహీనత, గుండె జబ్బులు ఉన్న రోగులను హైరిస్క్ గర్భిణులుగా గుర్తిస్తారు. అటువంటి హైరిస్క్ రోగులను పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచి ఘోషా ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. హైరిస్క్ గర్భిణులకు అవకాశాన్ని బట్టి సుఖ ప్రసవం జరిపిస్తారు. అవసరమైన వారికి సిజేరియన్ చేస్తారు. అదేవిధంగా ల్యాప్రోస్కోపిక్ టూబెక్టమీ, శస్త్రచికిత్సలు కూడా ఇక్కడ చేస్తున్నారు. గైనిక్ సమస్యలకు సంబంధించి హిస్టెక్టమీ (గర్భసంచి) ఫైబ్రాయిడ్స్ (కణితుల తొలగింపు) వంటి అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

ప్రసవాల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు

గర్భిణులకు సాధారణ ప్రసవంతో పాటు సిజేరియన్ చేయడానికి అవసరమైన సౌకర్యాలు ఘోషాఆస్పత్రిలో ఉన్నాయి. అదేవిధంగా గర్భిణులకు ఎక్కువగా రక్తం అవసరం పడుతుందని బ్లడ్ స్టోరేజ్ యూనిట్ కూడా ఏర్పాటు చేశారు.



వైద్య తనిఖీల కోసం వచ్చిన గర్భిణులు

అంకిత భావంతో వైద్యసిబ్బంది సేవ



ఘోషాఆస్పత్రిలో ఉన్న వైద్యులు అందరూ అంకిత భావంతో పనిచేస్తున్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులకు కూడా ప్రసవాలు జరిపిస్తున్నారు. గైనిక్ సంబంధిత వ్యాధులతో వచ్చేవారికి అవసరమైన శస్త్రచికిత్సలు చేస్తున్నాం. అందరి రోగులను సమాన స్థాయిలో చూసుకుంటున్నాం.

డాక్టర్ అరుణ శుభశ్రీ,
డిప్యూటీ సూపరింటెండెంట్, ఘోషాఆస్పత్రి

క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మీసాల వెంకటరమణ

జి.సిగడాం: మండలంలో మధుపాం గ్రామానికి చెందిన జాకి ఆదినారాయణ ఇటీవల వెన్నెముక సమస్యతో బాధపడటంతో ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఇందుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2 లక్షల 50 వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ చెక్కును గురువారం మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, సచివాలయం కన్వీనర్ నల్లి తవిటినాయుడు చేతుల మీదుగా ఆదినారాయణకు అందించారు.కార్యక్రమంలో నాయకులు జాకీ రామారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

విశ్వశాంతికి మార్గదర్శి ఏసు



బిషప్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఏసుక్రీస్తు మార్గం విశ్వశాంతికి మార్గమని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నాయకుడు బిషప్ రెవ. డా.డీఎస్‌పీఎస్ కుమార్ అన్నారు. అరసవల్లిలోని ఎకలేకటోస్ చర్చి మొదటి ఆరాధన వేడుక ఎలోహిమ్ గాస్పెల్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.కృపానందం, మండ ఇలీషా, బవిరి రమణ మాస్టర్, ఉమా, డాక్టర్ జాన్‌జీవన్, పాస్టర్ ఎస్.సురేష్ ఐజక్, పాస్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని చంద్రయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసి బదిలీపై వెళ్లిన మక్క గంగేశ్వరిని సర్పంచ్ బొల్లా లక్ష్మీ భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లా జనార్దనరావు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. ఆమెతో పాటు బదిలీపై వెళ్లిన ఉరిటి సతీష్ పట్నాయక్, పందిరి కోటేశ్వరరావు, కుప్పిలి పద్మావతిలను కూడా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బస్వా రమేష్, ఉపాధ్యాయులు పేకల రమేష్, వల్లూరు రమణ, లింగరాజు, దామోదరావు, నాయకులు గోవిందరావు, కర్రి జ్యోతి పాల్గొన్నారు.

బాలిక చికిత్సకు సాయం



రూ.50 వేలు అందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట గ్రామానికి చెందిన చాట్ల పునర్నివి అనే బాలిక తలసీమియా వ్యాధితో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల కోసం అదే గ్రామానికి చెందిన లవ్ అండ్ కేర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ యండ హైమావతి, కూర్మారావు దంపతులు రూ.50 వేల సాయం అందజేశారు. ఈమె అత్తయ్య యండ చంద్రావతి చేతుల మీదిగా గురువారం నగదును అందజేశారు.

సాయినాథునికి క్షీరాభిషేకాలు




సాయిబాబా

శ్రీకాకుళం కల్చరల్: ఏపీహెచ్‌బీ కాలనీలో షిరిడీ సాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో గురువారం ఉదయం కాగడ హారతి, మొదటి పూజ నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీనివాసశర్మ నేతృత్వంలో స్వామికి క్షీరాభిషేకాలు చేశారు.

ఉమాకవికి వందేభారతం ప్రశంసాపత్రం

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానిలయం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భోగెల ఉమామహేశ్వరరావుకు హిందూ భారతి జాతీయ సాహిత్య వేదిక అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ నిర్వహించిన వందే భారత్ అంతర్జాల కవితోత్సవంలో ప్రశంసాపత్రం లభించింది. జైభారత్, వందనం భారతి అనే కవితలు చదివినందుకు ఈ ప్రశంసాపత్రం అందించారు. ఈయనతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడే పాలక దేవానంద్‌కు కూడా ప్రశంసాపత్రం లభించింది. వీరిని సాహితీ సభ్యులు కిరణ్, బాలకృష్ణ, రెడ్డి పద్మావతి, పి.వి.దుర్గాప్రసాద్, చాట శ్రీనివాస్ అభినందించారు.

ఆదిత్యాలయంలో ఇంటి దొంగలు!



అరసవల్లి సూర్యదేవాలయం

- ఉన్నతాధికారుల ఆదేశాల గోప్యతను బయటపెడుతున్న వైనం
- గతంలో ఏసీబీకి చిక్కిన ఓ ఉద్యోగికి కీలక విభాగాలు
- కఠిన చర్యలకు వెనుకాడుతున్న ఈవో
- ఆలయ అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ఫేక్ ఫిర్యాదులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి క్షేత్ర ప్రతిష్టను భంగపరిచేలా కొందరు ఇంటిదొంగల వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆలయానికి చెందిన పలు కీలక ఆస్తులు, ఆదాయాల ఫైళ్లు, పరిపాలన వ్యవహారాలపై ఉన్నతాధికారుల నుంచి వస్తున్న నివేదికలు, విచారణాదేశాలపై గోప్యతను పాటించాల్సిన కీలక సిబ్బంది..'కంచే చేను మేసేలా..' వ్యవహారాలు వెలగబెట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆలయానికి చెందిన కీలక సమాచారాన్ని, గోప్యతాంశాలను కొందరు తమ వాట్సాప్‌ల ద్వారా, జిరాక్స్ కాపీల ద్వారా 'బయటకు' పంపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయంలో కీలక పత్రాలను, రిజిస్టర్లను, ఓచర్లను సైతం బయటవారికి (పచ్చ పత్రికలకు) ఉద్దేశపూర్వకంగానే అందజేస్తున్న వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందనే అభిప్రాయాలు స్థానిక భక్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆలయ పరిపాలన విభాగంలో సదరు వ్యక్తులు, సిబ్బంది వ్యవహారాలపై ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. భక్తులకు మంచి దర్శనం, సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టిన ఈవో.. పరిపాలన వ్యవహారాలపై కొరడా ఝులిపించకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది.

అతనికి కీలక బాధ్యతలా...!

అరసవల్లి ఆలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గతంలో విశాఖ జిల్లాలో ఓ దేవాలయంలో పనిచేస్తూ ఏసీబీకి చిక్కాడు. అప్పట్లో ఈయన వ్యవహారం సంచలనమే అని చెప్పాలి. అలాంటి ఉద్యోగికి ఏకంగా 6ఏ క్యాడర్‌లోని ప్రఖ్యాత సూర్యదేవాలయంలో నియమించడంతో పాటు కీలక బాధ్యతలు అప్పగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా గురువారం విశాఖపట్నంలో జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో కూడా ఇదే అంశంపై ఈవో వి.హరిసూర్యప్రకాష్ వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. కీలక బాధ్యతలు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించినట్లుగా సమాచారం. ఈయన వ్యవహారం ఇప్పుడు అరసవల్లిలో హాట్ టాపిక్‌గా మారింది. దినసరి వేతనాల పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు యువతీ యువకులకు 'శాశ్వత ఉద్యోగులుగా' చేస్తానంటూ పాత ధోరణిని ప్రదర్శించడం మొదలుపెట్టారని వార్తలొస్తున్నాయి. ఆలయంలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో ఉన్నప్పటికీ వారికెవ్వరికీ పెద్దగా ప్రాధాన్యత విభాగాలను అప్పగించకుండా బదిలీపై వచ్చిన ఈయనకే కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫేక్ లేఖలు..

గత ప్రభుత్వం హయాంలో అరసవల్లిలో ఏ ఒక్క అభివృద్ధి జరగని సంగతి విదితమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో ప్రస్తుత ప్రభుత్వం హయాంలోనే రెండోసారి కూడా పాలకమండలిని నియమించడంతో పాటు వారి ప్రోత్సాహంతో భక్తుల నుంచి పెద్ద ఎత్తున విరాళాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ రూపురేఖలు మారిపోయేలా అటు మూలవిరాట్టుకు మకరతోరణాలతో పాటు ఇటు భక్తుల వినియోగానికై అద్భుత సౌకర్యాలు కలిగిస్తున్నారు. లక్షలాది రూపాయలతో పనులను చేపడుతుంటే.. వీటిని చూసి తట్టుకోలేని కొందరు ఎలాగైనా ఈ అభివృద్ధి పనులను అడ్డుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. పనుల్లో అవినీతి జరుగుతోందంటూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆకాశరామన్న లేఖల ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. కేవలం వ్యక్తిగత కక్షలతోనే ఇలాంటి పేరు, ఊరు లేకుండానే ఫిర్యాదు లేఖలు పంపించినట్లు ఆలయ అధికారులు గుర్తించారు. ఏదిఏమైనా అరసవల్లి ఆలయంలో తప్పుడు వ్యవహారాలపై ఈవో ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు చేపడితేనే ఆలయ పాలన గాడిలోకి పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కీలక పత్రాలు బయటకు రావడంపై విచారణ..



దేవదాయశాఖ కమిషనర్‌కు ఎవరో పంపిన ఫిర్యాదుపై విచారించి ఉన్నతాధికారులకు కాన్ఫిడెన్షియల్‌గానే నివేదిక పంపిస్తామనుకున్నాం. అయితే ఫిర్యాదు కాపీ బయటకు వెళ్లడంపై సీరియస్‌గా పరిగణిస్తున్నాం. దీనిపై విచారించి తగు చర్యలు చేపడతాం. ఆలయంలో ఖర్చు, వినియోగాలపై ప్రతి పైసాకు..స్టేట్ ఆడిట్ శాఖ ప్రీఆడిట్ నిర్వహిస్తోంది. దీంతో దాదాపుగా ఆర్థిక అంశాలు, వినియోగాలన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయి.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈవో

రైతు సంక్షేమమే ధ్యేయం



సేతుభీమవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా సంపూర్ణ సేవలు అందిస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం సేతుభీమవరంలో రూ.22 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్న ట్లు తెలిపారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్ని లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్ర మంలో ఎంపీపీ మీసాల సత్యవతి, జి.సిగడాం, లావేరు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు మీసాల వెంకటరమణ, రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీ సీ సభ్యులు కాయల రమణ, మీసాల సీతంనాయు డు, జేసీఎస్ కన్వీనర్లు డోల వెంకటరమణ, మీసా ల శ్రీనివాసరావు, సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ సభ్యులు కుదిరెళ్ల గోవిందరావు, మీసాల దానకర్ణ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, పీఏసీఎస్ చైర్మన్లు ఏర్నేన ప్రకాశరా వు, పల్లేటి సన్యాసిరావు, పైల త్రినాథరావు, లావే రు వైస్ ఎంపీపీ ఉలకాపు శ్రీనివాసరావు, నాయకు లు బొంతు సూర్యనారాయణ, బొల్లి రమణ, నాగవరపు సాయి, పైల ఆదినారాయణ, కుదిరెళ్ల వెంకటరావు, పోకతోక రాంబాబు, ఇప్పిలి త్రినాథరా వు, ఎం.కనకారావు, కొనగంజి లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ర్యాలీ ప్రారంభం

- పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో సాగిన దేహదారుఢ్య పరీక్షలు
- పర్యవేక్షించిన ఆర్మీ ఉన్నతాధికారులు, ఎస్పీ దీపిక



అగ్నిపథ్ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయనగరంఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ గురువారం ప్రారంభమైంది. అర్ధరాత్రి నుంచే అభ్యర్థులు మైదానానికి చేరుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యిమంది యువకులు విజయనగరం రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ నుంచి పీటీసీకి చేరుకుని దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్నారు. ఆగస్టు రెండో తేదీ వరకూ ర్యాలీ కొనసాగనుంది. ముందుగా అడ్మిట్ కార్డులు పరిశీలించి, ఎత్తు కొలిచిన అనంతరం 1.6 కిలోమీటర్లు పరుగు పందెం నిర్వహించారు. తర్వాత పులప్స్, జిగ్జాగ్ వాకింగ్, డిచ్ జంపింగ్ తదితర శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీటిలో అర్హత సాధించిన సుమారు 300 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేశారు. వీరికి అల్పాహారం, భోజనాలను జిల్లా యంత్రాంగం సమకూర్చింది. ర్యాలీ ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక పర్యవేక్షించారు. ఆర్మీ అధికారి జి.ఎస్.రంధవ నియామక ప్రక్రియను ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, సీఐలు పాల్గొన్నారు.

తైవాన్ జామ సాగు పరిశీలన

గార: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేటలో తైవాన్ జామకాయల సాగును విజయవాడకు చెందిన పీఆర్ అండ్ ఆర్‌డీ జాయింట్ కమిషనర్ జ్యోతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు సాయం అందించడంలో భాగంగా ఇప్పటికే పామాయిల్ తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ చిట్టి రాజు, ఏపీడీ శైలజ, ఏపీఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

22న కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

అరసవల్లి: కంచిలి మండలం మఠం సరియాపల్లి, మాణిక్యపురం పీహెచ్‌సీల్లో ఈ నెల 22న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సమక్షంలో ఈ ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్త పరీక్షలు, సీరం క్రియాటిన్ లెవల్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వివరించారు.

ఉపాధి పనులతో మేలు కలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ చిన్నతాతయ్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి పనులు చేసేటప్పుడు వేతదారులకు మేలు కలగాలని, ఆ ప్రాంతం అభివృద్ధి చెందాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం డైరెక్టర్, విజిలెన్స్ అధికారి పి.చినతాతయ్యలు అన్నారు. జిల్లాలో ఉపాధి పనుల తీరుపై గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అవినీతికి దూరంగా ఉండాలన్నారు. రైతులకు మేలు జరిగేలా పనులు చేయించాలని సూచించారు. జిల్లాలో పనులు చురుగ్గా జరుగుతున్నాయని, మెటీరియల్ కాంపొనెంట్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ జ్యోతి, డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, ఏపీఓలు, ఏపీడీలు, టెక్నికల్ సిబ్బంది, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

పనిదినాల కల్పనలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం..

రాష్ట్రంలో ఈ ఏడాది 24 కోట్ల పనిదినాల లక్ష్యానికిగాను ఇంతవరకు 18 కోట్ల పనిదినాల కల్పించామని డైరెక్టర్ తెలిపారు. దేశంలో ఇదొక అరుదైన రికార్డు అని చెప్పారు. డీబీటీ విధానం ద్వారాకూలీలకు వేతనాలు చెల్లిస్తుండటంతో ఎటువంటి అవినీతి ఆరోపణలకు ఆస్కారం లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది 45 లక్షల కుటుంబాలకు ఆరు వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. 60 వేల ఎకరాల్లో ఉద్యానవనాల పెంపకానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మౌలిక వసతుల కల్పనకు రూ.3500 కోట్ల నుంచి రూ. 4వేల కోట్ల వ్యయం చేస్తున్నామని వివరించారు. చిన్న, సన్నకారు రైతులు మునగపంట సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చన్నారు.

40 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యం



మొక్కలు నాటుతున్న సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో 40 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం సంతసీతారంపురంలోని సైక్ వ్యవసాయ కళాశాలలో గురువారం వెయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపేట మండలం సన్యాసిపుట్టుగ గ్రామంలో 760 మొక్కలు నాటినట్లు తెలిపారు. రైతులు ముందుకు వచ్చి ఎకరాకు మించి స్థలం అప్పగిస్తే మొక్కలు నాటి అభివృద్ధి చేస్తామని చెప్పారు. రైతులు ఫలసాయం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యడు వై.లింగరాజు, సత్యసాయి సంస్థ ప్రతినిధులు, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంగయ్యనాయుడు మృతికి సంతాపం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

లావేరు: మురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డు హెచ్‌ఎం తేనేల మంగయ్యనాయుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం అర్ధరాత్రి తన స్వగృహం వద్ద మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీకు కంచుకోటగా ఉండే మురపాక పంచాయతీలో సర్పంచ్, రెండు ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీఅభ్యర్థులు గెలవడంలో మంగయ్యనాయుడు కీలక పాత్ర పోషించారు. ఈయన మృతి పట్ల గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఉలకాపు శ్రీనివాసరావు తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

వలంటీర్లపై ఆరోపణలు సరికాదు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



ధ్రువపత్రాలను అందజేస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: వలంటీర్లపై నిరాధారణ ఆరోపణలు చేయడం తగదని, వలంటీర్ల కృషి వల్లే సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం గార మండలం సతివాడ, కొర్లాం సచివాలయాల పరిధిలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా 20 రోజుల్లో రాష్ట్రంలో 25 లక్షల మేర ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశామని వివరించారు. అసైన్డు భూములు 20 ఏళ్లు సాగుబడిలో ఉంటే అమ్ముకునే అవకాశం కల్పించామని, ఈ నిర్ణయంతో 15 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో 8 షిప్పింగ్ హార్బర్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు వేసినట్లు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులకు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మాట ఇచ్చి తప్పుకున్నాడని, ఇచ్చిన మాటకు కట్టుబడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మూడు విడతలుగా రుణమాఫీ నిధులు జమచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పీస శ్రీహరిరావు, యాళ్ల నారాయణమూర్తి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, బొడ్డేపల్లి పద్మజ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్, ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, కొయ్యాన నాగభూషణం, సుగ్గు మధురెడ్డి, ఎంపీటీసీ పొదిలాపు శ్రీరాములు, పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

2030 తరువాత బీఎడ్ కోర్సు ఉండదు

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో 2030 తరువాత బీఎడ్ కోర్సు ఉండదని, నిపుణులైన ఉపాధ్యాయులను తయారు చేసే నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కోర్సు మాత్రమే ఉంటుందని అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి విశ్వవిద్యాలయంలో బీఎస్సీబీఎడ్ (ఎంపీసీ), బీఏబీఎడ్ (హెచ్‌ఈపీ) సబ్జెక్టులతో కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 100 సీట్లు అందుబాటులో ఉంటాయని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్ష నిర్వహణ తరువాత ఉన్నత విద్యా మండలి కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హత బట్టి ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడేళ్ల తర్వాత డిగ్రీతో రిలీవ్ కావచ్చునని, నాలుగేళ్ల తరువాత డిగ్రీతో కలిపి బీఎడ్ అర్హత ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రయోగ విద్య, క్షేత్ర స్థాయి విద్యకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ సంస్థ కోర్సు నిర్వహణకు అనుమతి ఇచ్చిందన్నారు.

తైక్వాండో పోటీల్లో సిక్కోలు కుర్రాడి ప్రతిభ



గోల్డ్‌మెడల్ సాధించిన గురుగుబెల్లి సుబ్బారావు

ఆమదాలవలస రూరల్ : బ్యాంకాక్ థాయిలాండ్‌లో ఈ నెల 15 నుంచి జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో సిక్కోలు కుర్రాడు ప్రతిభ కనబరిచాడు. ఆమదాలవలస మండలం అక్కులపేటకు చెందిన గురుగుబెల్లి సుబ్బారావు 80 కిలోల కేటగిరీ కయోరుజీ విభాగంలో బంగారు పతకం సాధించాడు. మొత్తం 8 దేశాల నుంచి క్రీడాకారులు హాజరైన ఈ పోటీల్లో 31–40 ఏళ్ల వ్యక్తిగత విభాగంలో పతకం సాధించి సత్తాచాటాడు. పూమ్‌సేయ్ విభాగంలోనూ సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. ఈయన తల్లిదండ్రులు వెంకటరమణ, కృష్ణవేణి వ్యవసాయ కూలీలు. సుబ్బారావుకు క్రీడలపై ఆసక్తి ఉన్నందున హైదరాబాద్‌లోని సోమా పిట్ వరల్డ్ తైక్వాండో అకాడమీలో శిక్షణ ఇప్పించారు.ఇంజనీరింగ్ చదువుతూనే పోటీల్లో పాల్గొంటూ గతంలో బ్యాంకాక్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకం, కొరియాలో రజత పతకం సాధించాడు. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని ఆశిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.

సృజనాత్మకతకు క్రీడలు దోహదం



విజేతలతో సీఐ సన్యాసినాయుడు, క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రీడలు దోహదపడతాయని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. అంతర్జాతీయ చదరంగం దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం చెస్ అకాడమీలో రెండు రోజుల చదరంగం పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవి కుమార్ అధ్యక్షతన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాదాన దేవభూషణరావు, సెక్రటరీ టి.రాంగోపాల్, కోశాధికారి శిల్లా మణి, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, పారిశ్రామికవేత్త అంధవరపు సంతోష్, చెస్ అకాడమీ నిర్వాహకులు బేరి చిన్నారావు, క్లబ్ సభ్యులు సీపాన రమేష్‌కుమార్, వైశ్యరాజు రాజు, కోట భూపతినాయుడు, రామ్మోహన్ పాల్గొన్నారు.

అమృత్ చెరువులను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



బొంతలకోడూరులో చెరువు పరిశీలిస్తున్న పీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ జ్యోతి

ఎచ్చెర్ల క్యాంపస్ : అమృత్ సరోవర్ చెరువులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పీఆర్‌డీ డిప్యూటీ కమిషనర్ ఎ.జ్యోతి అన్నారు. బొంతలకోడూరులో ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసిన అమృత్ సరోవర్ (మార్కండేయ కోనేరు) చెరువును గురువారం పరిశీలించారు. ఈ చెరువు వద్ద రూ.10 లక్షలతో మట్టి పనిచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం పనులు త్వరితగతిన పూర్తి చేసి చెరువు గట్లపై మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టిరాజు, ఏపీవో శోభాదేవి, సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ మాడుగుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటరు సర్వేకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎచ్చెర్ల అసెంబ్లీ ఓటర్ల నమోదు అధికారి మురళీకృష్ణ

రణస్థలం: ఇంటింటా ఓటర్ సర్వే కార్యక్రమంలో అన్ని పార్టీల బూత్ కమిటీ ఏజెంట్లు భాగస్వామ్యం కావాలని ఎచ్చెర్ల నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ కోరారు. రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల అధికారి ఆదేశాల ప్రకారం నేటి నుంచి వచ్చే నెల 20 వరకు జరిగే ఇంటింటా ఓటర్ సర్వేలో ఏజెంట్లు పాల్గొంటే సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం అవుతుందని చెప్పారు. ఒక కుటుంబానికి ఒకే ఇంటి నంబర్ ఉండేలా బీఎల్వోలకి ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తారని, మరణాలు, రెండేసి ఓట్లు ఉంటే తొలగిస్తామని తెలిపారు. గ్రామసభ నిర్వహించి ఓటర్లు జాబితా చేర్పులు మార్పులు చేపడతామన్నారు. వలస ఓటర్ అభిప్రాయం ప్రకారం ఎక్కడ కావాలంటే అక్కడే ఓటు హక్కు ఉండేలా చూస్తామన్నారు. సర్వేలో ఎక్కడైన వలంటీర్లు పాల్గొన్నట్లు ఫిర్యాదు వస్తే సంబంధిత వీఆర్వోపై తక్షణ చర్యలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు సనపల కిరణ్‌కుమార్, దిలీప్ చక్రవర్తి, టి.సత్యనారాయణ, పప్పల వేణుగోపాల్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.